# పాపం పండలేదు!

ట్రైన్ దిగి, సూర్యనారాయణ రోడ్డుమీదకు వచ్చేప్పటికి — కారు మేఘాలు చంద్రుణ్ణి బలవంతాన కౌగలించుకున్నాయి. వయస్సులో పడ్డ రాత్రి చీకట్లో బావురుమంది. వర్షం వచ్చేలోపు ఇంటికి వెళ్ళాలనే ఆదుర్దాకొద్దీ అతను చకచకా నడవసాగాడు. రైల్వేస్టేషనుకూ ఊరికీ మధ్య దూరం మూడుఫర్లాంగులు. అంతలోగా చంద్రుడు నల్లమబ్బుల బారినుండి బయటపడ్డాడు. ఏడ్చి ముఖం కడుక్కున్నట్టుగా వెన్నెల పడసాగింది.

సూర్యనారాయణ ఊరి మొదల్లోకి రాగానే మళ్ళీ నల్లని మేఘాలు కుట్రపన్నినట్టుగా చంద్రుణ్ణి చుట్టుముట్టాయి. వెలుగూ చీకట్లతో, ఊరు నిబ్బరంగా నిద్రపోతోంది.

ఊరి మధ్యలో వుంది సూర్యనారాయణ ఇల్లు. ఇల్లు తండ్రికాలం నాటిదేఐనా, ఇంటిచుట్టూ సిమెంటు రాళ్ళ ప్రహరీని అతను పెద్దవాడైన తర్వాతనే కట్టించాడు. ఇంటిముందు పెద్ద గార్డెన్ కూడా పెంచాడు. తండ్రి చనిపోయాక ఇంటి పెత్తనం అతని చేతుల్లోకే వచ్చింది. ఒక్కడే కొడుకు కావటాన తల్లి శాంతమ్మకు - పెత్తనం చెలాయించాలన్న అభిలాష పూర్తిగా వున్నప్పటికీ, చేతులు ముడుచుకొని కూర్చోక తప్పలేదు. వాస్తవంగా ఆవిడ మనస్సూ, ప్రాణమూ, ఆత్మా - కొడుకుమీదకంటె కూతురు కాంతంమీదనే ప్రాకులాడుతూవుంటాయి.

ఆవిడకు తన బ్రతుకూ, సుఖాలూ ఒకఎత్తు; కాంతం శ్రేయస్సు, సుఖాలూ మరొక ఎత్తు. కాని అల్లుణ్ణి వెతికి, కూతురుపెళ్ళి చేయటంలోనే తిరుగు లేని తప్పటడుగు వేసింది. స్త్రీ జీవితంలోని సౌఖ్యానికి ధనం పుష్కలంగా గల భర్త పట్టుగొమ్మలాంటివాడని ఉద్దేశ్యపడి, లక్షాధికారియైన యువకునికిచ్చి కాంతం పెళ్ళి వైభవంగా చేసింది. కాని అప్పణ్ణుంచీ ఆవిడ మనోవేదనతో ఓప్రక్క క్రుంగిపోతూనే వున్నది – మృగతృష్ణలాంటి డబ్బువ్యామోహానికి కాంతం దాంపత్యసుఖాలు బలికాబడ్డాయని. కాంతంభర్త క్యాన్సర్‌రోగి. పెళ్ళికిముందే అతనికాజబ్బువున్నదికానీ – బయటపడనివ్వలేదు. కాంతానికి భర్తంటే జుగుప్స, ద్వేషం, అయిష్టత. లక్షలకొద్దీ ధనమూ, ఖరీదైన ఫర్నిచర్‌తో మూడంతస్థుల మేడా, అందమైన కారూ, బోలెడంత బలగమూ వున్నా – ఆమె భర్తదగ్గర పట్టుమని నెలరోజులు కూడా వుండలేదు; సంవత్సరంలో ఎక్కువభాగం పుట్టింట్లో తల్లిదగ్గరే వుంటుంది. కూతురిసౌఖ్యాన్ని గురించి శాంతమ్మకున్న కోర్కెలు కాళ్లులేని కొయ్యగుర్రాలవలె తయారైనాయి.

పెద్దబజారులో రథశాల ప్రక్క సందులోవున్న తన ఇంటిముందు కొచ్చి – ఓరగా వేసివున్న వీధితలుపుల్ని చూసి దిగ్భ్రాంతి చెందాడు సూర్యనారాయణ. ఆ రాత్రి ట్రైన్‌కు తను ఇంటికి వస్తానని చెప్పలేదు. ఇంత రాత్రివరకూ వీధి తలుపు లెందుకు వేసికోలేదు? తటపటాయిస్తూ అతను మెల్లగా ఇంటిముందు గార్డెన్‌లో ప్రవేశించాడు.

నల్లటి తెరలు దించినట్టుగా ఇంటిచుట్టూ చీకటి తారట్లాడుతూంది.

హాలులోని బెడ్‌లాంప్ కాంతి కిటికీ సందులోంచి వసారాలో పల్చటి సారగా పడుతోంది. ఇంటి చుట్టూ నిశ్శబ్దం నిలకడగా రాజ్యమేలుతోంది.

ఇంటిలో గది తలుపులు గడియ తీసిన శబ్దం హఠాత్తుగా వినవచ్చే సరికి – సూర్యనారాయణ గార్డెన్‌లో జామచెట్టు చాటుకు తప్పుకొని నిలబడ్డాడు.

ఇంటిహాలు తలుపు తెరుచుకొని పాతికేళ్ళ వ్యక్తి గబగబా వసారాలోంచి బయటకొచ్చి, గార్డెన్‌లోంచి నడచి వీధితలుపు తీసుకొని వెళ్ళిపోయాడు.

అతన్ని గుర్తుపట్టాడు సూర్యనారాయణ. అతన్ని గుర్తుపట్టిన సూర్యనారాయణ మనసు ఆగ్రహంతోనూ, ఆవేశంతోనూ, ఆశ్చర్యంతోనూ మెలికెలు తిరిగి పోయింది. కాళ్ళక్రింద భూమి జవజవలాడినట్లయింది. ఒంట్లోని నీరంతా పాదరసంవలె బుర్రలోకి ఎక్కినట్లయింది. మెదడు బండబారింది. గొంతు పొడిఆరింది. పళ్ళు పటపటమన్నాయి కళ్ళముందు చీకటిగోళం చిందులు వేసింది.

...ఆ శేఖర్‌గాడు అర్ధరాత్రి సమయంలో తన ఇంటిలోనుంచి రావడమా? ఎంత విడ్డూరం ఎంత దుర్ఘటన! ఆ జూలాయిగాడు, పోకిరీ, వ్యభిచారీ, జూదరీ, రౌడీ, ఊళ్లో చిన్న మెత్తు విలువలేని వెధవా — తను లేని సమయంలో ఇంటిలో జొరబడటమా? ఇంకా యీ కొంప పరువు ప్రతిష్ఠలు క్షణకాలం నిలుస్తాయా! కుటుంబ గౌరవం గాలిలో కల్సిపోదూ! రేపు వీధిలో ముఖమెత్తుకొని తిరగడ మెట్లా? సమాజంలో పరపతేముంటుంది? ఎవరు కారణం? నీతి జారిందెవరు — ఒరలోంచి దూసిన కత్తిలా జామచెట్టు చాటునుంచి ఇంటి వసారాలోకి దూకాడు సూర్యనారాయణ.

వసారావాకిటిలో తల్లి శాంతమ్మ ఎదురైంది.

ఆవేళప్పుడు కొడుకును చూసి నిలువునా నిర్వీణ్ణురాలైంది.

“ఎవరే వాడు? ... ఆ శేఖర్‌గాడీవేళప్పుడు మనింటి కెందుకొచ్చాడు?” సూర్యనారాయణ గొంతులో కోపోద్రేకాలు ఖంగున రంకేవేశాయి.

శాంతమ్మకు కాకతాళీయంగా పక్షవాత మొచ్చినంత పనైంది. పెదాలు కదల్చలేకపోయింది. గుండెలో రేగినభయం గొంతుకు ఆనకట్ట వేసింది. గుడ్లప్పగించి — దీర్ఘంగా చూసింది.

సూర్యనారాయణ మళ్ళీ గర్జించాడు.

కోపంవస్తే కొడుకు కొడుకుగాడనీ, ప్రళయకాల రుద్రుడనీ, ఆలోచన యెరుగని ఆవేశపరుడనీ ఆవిడకు తెలుసు. కొన్నిక్షణాలపాటు నిప్పులమీద నిలబడ్డట్టు నిలబడి సంశయించింది. కాని ప్రయోజనం లేదు. పట్టుదలకు పదేళ్లు ముందుపుట్టాడు సూర్యనారాయణ. పరిస్థితుల పరిణామాల్నిగురించి యోచించలేని తొందరపాటులో అన్నది:

"జరిగిందేదోజరిగిపోయింది. ఇప్పుడెందుకురా? మన బంగారం మంచిదైతే...వాడికీ మీ ఆవిడకూ ఎన్నాళ్ళనుంచో..."

"ఆఁ! ..నిజంగానా! ఓసి...దీని..." అంటూ సూర్యనారాయణ పిచ్చికోపంతో క్రిందనుంచి పైవరకూ కంపించిపోయి పడకగదితలుపుల్ని ఒక్క తన్ను తన్నాడు.

బయట మబ్బులు కమ్మిన చీకటి ఆకాశంలో మెరుపు మెరిసి–భయంకరంగా ఉరుము వురిమింది.

భయకంపితురాలై శాంతమ్మ అరిచేతిలో ప్రాణాల్ని పెట్టుకొని నిలబడ్డచోటే నిలబడింది.

ప్రక్కగదిలో పడుకున్న శాంతంగుండె భయాందోళనతో కృష్ణా బ్రిడ్జిమీద జి. టి. ఎక్స్‌ప్రెస్ పోతూన్నట్టుగావుంది.

సూర్యనారాయణ తన్నిన తన్నుకు తలుపులు కేకలు పెడుతూ తెరుచుకున్నాయి. ఓమాదిరి నిద్రలోవున్నా భార్య లక్ష్మి త్రుళ్ళిపడి నిద్రనుండి లేచింది. ఆ నిద్రంతా నటనగా తోచింది అతనికి.

భర్త ఆకారంలోని భీకరత్వానికి లక్ష్మి నిద్రమత్తులోనే బెందువడిపోయింది. అదేమిటండీ! అట్లాఉన్నారు?"

"ఎంత అమాయికంగా మాట్లాడతావే! ఇంకా మొగుడికళ్ళల్లో కారం కొట్టాలనే! ... ఎంత బరి తెగించావు! ఎంత అవినీతికి పాల్పడినావు? నిన్ను సహించను! క్షమించను! నీ నెత్తురు కళ్ళజూడనిదే నా మనస్సు శాంతించదు. నీ నీతిమాలిన ప్రవర్తనకు తగిన ప్రాయశ్చిత్తం చేయనిదే నేను నిద్రబోను. నీ చావు నా చేతుల్లోనే రాసిపెట్టివున్నది..."

పట్టరాని కోపోద్రేకంవల్ల గుండె కొలిమిలోని ఎర్రటి ఇనుపగుండుకాగా, వెచ్చటి పొగలు శరీర భాగాల నన్నింటినీ చుట్టుకోగా సూర్యనారాయణ పిడికిలి బిగించి భార్య జుట్టుపట్టుకొని 'ఫెడీఫెడీ' మని వీపుమీద బలం కొద్దీ గుద్దాడు.

లక్ష్మి హేతువులేని భర్త క్రోధావేశపు చేష్టలను సహిస్తూ కిక్కురు మనలేదు. కాని ఆ దెబ్బల ధాటి కోర్వలేక నేల కొరిగింది.

అప్పటికీ సూర్యనారాయణ కోపోద్రిక్తత సద్దుమణగలేదు. అతని లోని మానవత్వం మేల్కొలేదు; హృదయాన్ని కబళించిన కాఠిన్యత కరిగి పోలేదు; ఆత్మలో ప్రవేశించిన ద్వేషం జారిపోలేదు. పైపెచ్చు ద్విగుణీ కృతమైనాయి. అతనిలోని క్రోధావేశాలు శిఖరారోహణకు చేరుకున్నాయి. మానవత్వం పూర్తిగా మృగ్యంకాగా హంతకుని ఉన్మాదంతో కిటికీలో వున్న చాకు తీసికొని భార్యగుండెలో కసికొద్దీ 'కసకస' పొడిచాడు. వేడి రక్తం చివ్వున చిమ్మింది. అతని చొక్కాపై ఎర్రగా ఆ రక్తపు జల్లు పడింది. 'అమ్మా'' అని కేక వేసి, గిలగిల నేలపై తన్నుకొని కన్నుమూసింది అమాయికప్రాణి లక్ష్మి.

"చచ్చింది. చావాల్సిందే! అవినీతికదే ప్రాయశ్చిత్తం! నిప్పు లాంటి కుటుంబానికి మచ్చ తెచ్చిన నీతిమాలినదాని కదే శాస్తి!' అంటూ సూర్యనారాయణ ఆ నెత్తురుతో తడిసిన కత్తిని చేత్తో ఎత్తి పట్టుకొని, గది ప్రతిధ్వనించేట్టు వికటాట్టహాసం చేస్తూ గంతులేయసాగాడు.

కొడుకు చేతిలో నెత్తురుకత్తినీ, నెత్తురు మరకలైన గుడ్డల్నీ చూసి - శాంతమ్మ కొయ్యబారిపోయింది.

ప్రక్క గదిలో కాంతం మంచంమీద మునగదీసికొని పడుకొని నిండా రగ్గు కప్పుకుంది - గుండె అదిరిపోతూండగా.

ఆ నెత్తుటి కత్తిని తీసికొని ఆ అర్థరాత్రి ఊళ్ళో పోలీసు స్టేషనుకు వెళ్ళి - "నా భార్యను నేను చంపాను, ఇదిగో నేనామెను పొడిచిన కత్తి. ఇంకా నెత్తురు ఆరిపోలేదు. నన్ను అరెస్టుచేయండి" అన్నాడు సూర్యనారాయణ.

తర్వాత మూడుమాసాలకు సెషన్సుకోర్టులో సూర్యనారాయణకు యావజ్జీవ కారాగారవాసశిక్ష విధించబడింది.

* * *

కాంతానికి మూడో నెల. గర్భిణీవచ్చిన దగ్గర్నుంచీ ఆమె భర్త దగ్గరే వుంటూన్నది. వారం వారం తన ఆరోగ్యాన్ని తెలియపరుస్తూ ఆమె తల్లికి ఉత్తరాలు వ్రాస్తూన్నది.

కాని శాంతమ్మ మనస్సు ప్రశాంతంగాలేదు. కూతురు గర్భిణీ ధరించడం ఆవిడకు సంతోషకారణమైనా – ఆ సంతోషాన్ని సంతృప్తిగా పొందలేక పోతూన్నది. ఆవిడహృదయంలో ఆరని చిచ్చు రగిలి పెరుగుతూన్నది. జీవితంపై, కాలంపై, అనుకూలించని విధిపై – రోజురోజుకు ద్వేషం, నిరాశ, అసహనత గోడలుకట్టుకుంటూ పోతున్నాయి. అన్నపానీయాలు లేకుండా తనలో తాను కుమిలి కృశించిపోతూన్నది –

ఇట్లా ఎందుకు జరిగింది! ఈ ఇంటిలోని విషాద సంఘటనలకు ప్రధానంగా తనే కారణం! తనలోని విపరీతమైన స్వార్థం, పక్షపాతబుద్ధి, ముందు ఆలోచనలేని తొందరపాటు – ఇన్ని అనర్థాలకూ మూలం. తనట్లా అబద్ధమాడి వుండకపోతే పరిస్థితు లేవిధంగా పరిణామం చెందేవో! తనెందుకు అబద్ధమాడింది? నిజంగా శేఖర్‌కూ, లక్ష్మికీ సంబంధమున్నదా? ఆ రోజు శేఖర్ లక్ష్మికోసమే తనింటికొచ్చాడా? లేదు. కాంతం కోసమొచ్చాడు. అవినీతికి పాల్పడింది కాంతం. తెలిసికూడా తనా అవినీతి కార్యం నుంచి కూతుర్ని అరికట్టలేదు. అందులో తన స్వార్థచింత వున్నది. కూతురి సుఖం వున్నది. క్యాన్సర్ రోగి అల్లుడు ఎక్కువకాలం బ్రతకడు. అతను బ్రతికివున్న కాలంలోనే కాంతానికి ఓ నలుసు కలిగితే – అల్లుడు ఆస్తి పరులస్వాధీనం కాదనే తలంపుతో తను కూతురు నీతి తప్పి ప్రవర్తించినా అదేమని మందలించలేదు. పైపెచ్చు ఆమెపై అవినీతి దుమారం చెలరేగకుండా – కన్నకొడుకుతోనే అబద్ధమాడింది. ఆ అవినీతిని అమాయకురాలైన కోడలికి అంటగట్టింది. ఘోరాతిఘోరమైన ఆ పాపాన్ని తను కూతురు పరువు, ప్రతిష్ఠలు జారిపోకుండా వుండటంకోసం ఆమె

నైతిక విలువల్ని రక్షించేందుకు ఆమె శ్రేయస్సు దెబ్బతినకుండా వుండేందుకు - చేసింది. అది తన పచ్చిస్వార్థం కావచ్చు. కూతురిమీద తనకున్న ప్రేమాభిమానాల పటుత్వం కావచ్చు. కూతురి జీవితం అవినీతి బురదలో అపఖ్యాతిపాలవుతుందన్న భయంవల్ల కావచ్చు. కాని ఆ అబద్ధంవల్ల పరిస్థితు లింత విషరూపాన్ని ధరిస్తాయని తనూహించలేదు. ఏమైనా తను క్షమించరాని పాపం చేసింది. శీలవతి, సద్వర్తని, అమాయకురాలైన లక్ష్మి అకాలమరణానికి బాధ్యురాలైంది. కన్నకొడుకును జైలుకు పంపించింది. ఇంతకంటె దారుణమైన పాపం మరొకటి వుండబోదు. ఆపాపానికి తను ప్రాయశ్చిత్తం అనుభవించక తప్పదు. భగవంతుడు తనకి తప్పకుండా శిక్షవిధిస్తాడు.

నెలల తరబడి శాంతమ్మ అట్లాంటి ఆలోచనలతో మానసికంగా, శారీరకంగా చిక్కి పొక్కిలాగైంది.

కాంతానికి కనేనెలలు రాగానే తన ఇంటికి తీసుకొచ్చింది శాంతమ్మ.

పదోమాసం సగం గడవగానే - కాంతానికి ఓరోజురాత్రి నొప్పులు వచ్చాయి. కమతగాడ్ని మంత్రసానికోసం గొల్లపాలెం పంపింది. మంత్రసాని వచ్చింది.

కాంతానికి కాన్పు కష్టమైంది. విపరీతమైనబాధకు గురైంది. తనవల్ల ఏమీకాదు. పెద్ద డాక్టర్ల దగ్గరకు బస్తీ తీసికెళ్ళాల్సిందేనన్నది మంత్రసాని ఆదుర్దాను కనబరుస్తు. అప్పటికే రాత్రి వార్ధక్యంలో పడింది. శాంతమ్మ భయోద్విగ్న చిత్తయై గగ్గోలుపడింది. బస్తీ పదిమైళ్ళ దూరముంది. ఆవేళప్పుడు బస్సులూ, రైళ్లూ వుండవు. ఎట్లా తీసుకెళ్ళడం? శాంతమ్మ పిచ్చెత్తినట్టు పురిటిగది బయటకూ లోపలకూ తిరిగింది. మంత్రసాని నిశ్చేష్టురాలై నిలబడింది. రాత్రి రెండుగంటల ప్రాంతాన కాంతం అతికష్టంమీద ఓ మగశిశువును కన్నది. కాని ఆ శిశువు భూపతనం జరగ్గానే అరుపూ శ్వాసా లేకుండా చనిపోవడం జరిగింది.

ఆ తర్వాత పావుగంటకే కాంతానికి హఠాత్తుగా గుర్రపువాతం వచ్చి - సూర్యోదయం కాకముందే కన్నుమూసింది.

గుండెలు బ్రద్దలుకొట్టుకొని శాంతమ్మ ఇల్లెగిరిపోయేలా ఏడ్చింది.

*   *   *

అంతా అయిపోయింది. కోడలు చంపబడింది. కొడుకు జైల్లో ఉన్నాడు. కూతురు చనిపోయింది. ఇక పోతే, తనొక్కతే మిగిలింది. ఈ ఇంటినీ, ఆస్తినీ, పొలాన్నీ - తనేం చేసుకుంటుంది? అవి తన దుఃఖాన్ని పోగొట్టగలవా? మనస్సుకు శాంతిని కలుగజేస్తాయా?... తనకు తగిన ప్రాయశ్చిత్తమే జరిగింది. భగవంతుడు తనకు సరైన శిక్ష విధించాడు! పరిస్థితులు తనపై కసిగానే పగతీర్చుకున్నాయి. తనొక్కతే! ఏకాకి!... ఇంకా తనేం చూసుకొని బ్రతకాలి? ఎవరికోసం? ఎందుకు? లక్ష్మీసమానురాలైన కోడలులేదు. ప్రాణానికి ప్రాణమైన కూతురులేదు. ఇంటికి పెద్దదిక్కయిన కొడుకు జైల్లో వున్నాడు. ఇంకా తన ప్రేమాను రాగాలు, మమకారాలు, అభిమానాలు - ఎవరిమీద? తను బ్రతికి ఎవర్ని ఉద్ధరించేందుకు? తన ఊహలు, ఆలోచనలు, కలలు - అన్నీ బెడిసి కొట్టాయి. ఎవ్వరి జీవితంలోని పెంపుకోసం తను ఆరాటపడిందో, ఎవ్వరి బ్రతుకు భాగ్యంకోసం ఆశగా బ్రతికిందో, - ఆ వ్యక్తి లేడు. తన పాపానికి ఫలితంగా భగవంతుడు తీసుకెళ్ళాడు. తన బ్రతుకు వెలుగు ఆరిపోయింది. ఈ అంధకారంలో తను జీవించడం వృధా ప్రయాసే! మనస్సులో మెర మెరలాడే యీ దుఃఖంతో, నరాల్ని క్రుంగదీసే దిగులుతో, కాలం స్తంభించినట్టుతోచే విచారంతో - తను బ్రతకలేదు. చావటం మంచిది. తను చావాలి! అదే తన కర్తవ్యం! ఎంతత్వరగా యీ లోకాన్ని విడిచి వెళ్లితే - తన ఆత్మ కంత శాంతి! . ఆ సంజ ప్రొద్దున శాంతమ్మ ఇంటి వసారాలో కూర్చుని గాఢంగా నిర్ణయించుకుంది. ఆ నిర్ణయం మనస్సులో గట్టిగా చేసికోగానే - ఆవిడలో తెగింపుతో కూడుకున్న సంతోషపు టావేశం ఉవ్వెత్తుగా లేచింది. వెంటనే ఇంటిలోకి వెళ్లింది.

నట్టింట దీపం వెలిగించబడలేదు. మునిమాపు మెత్తని చీకటి - నట్టింటిలో చిక్కబడింది.

శాంతమ్మ వంటగదిలోకి వెళ్ళి, కిరసనాయిలు డబ్బాలోని కిరస నాయిలును చీరపై దిట్టంగా చల్లుకుంది. పొయ్యిగడ్డపై ఉన్న అగ్గిపెట్టె

తీసుకుంది. అయినవాళ్ళంతా లేనప్పుడు తను బ్రతుకేమి ప్రయోజనమన్న విరక్తీ, కోరినవిధంగా పరిస్థితులు కల్సిరాలేదన్న కసీ, జీవితంపై రోతా, చావాలనే పట్టుదలా – ఆవిడలో ఏకగ్రీవంగా కూడబలుక్కుని హృదయాన్ని నల్లరాయివలె మార్చాయి. అగ్గిపుల్లతీసి, వెలిగించి, చీరకు అంటించుకుంది శాంతమ్మ. అంతలోకే ఆ మంటలు గనగన పైకిలేచి, ఆవిడ శరీరాన్ని చుట్టుముట్టాయి. ఆ అగ్నితీవ్రత కోర్చుకో లేక కెవ్వున కేకలు వేసింది. ఇరుగూ పొరుగూవాళ్లు పరుగెత్తుకుంటూ వచ్చి వెంటనే మంటల్ని ఆర్పారు. సగం సగం కాలిన శాంతమ్మ భయంకరమైన వికృతాకారంతో కుప్పలా కూలిపోయింది. అందరూ ఆవిడను మంచంపై చేర్చారు. ఆయుర్వే వైద్యునకు కబురు చేయగా, వచ్చి ప్రథమ చికిత్సగా ఏవో మందులు పైపూతకు వాడాడు.

ప్రక్కింటి సుభద్రమ్మ నట్టింటిలో దీపం వెలిగించింది.

కాలీకాలకుండా నల్లగా పొగచూరిన గోడవలె కావురేసికొని పోయిన వొళ్లు తుప్పు కత్తులతో గ్రుచ్చినట్లుగా కరకర బాధ పెడుతూండగా ఆ రాత్రి మంచంలో పడుకొని అనుకొన్నది శాంతమ్మ –

'తన పాపం పండలేదు! దేవుడికింకా తనపై దయ కలుగలేదు. తను చేసినపాపం సుఖమైన చావును కూడా ఇవ్వలేకపోయింది.'

(సాహితి)

—o—